# 28. ఇంతులంతా ఇంతేకాదు గాని...

"**చూ**డండి, అదిగో అలా చూడండి" అన్నట్టు ఆవిడ మొగుణ్ణి మోచేత్తో పొడిచి చూపించింది. అదో సినిమా హాలు. వాళ్ళ నలుగురి సీట్లూ ఇంచుమించు హాలు మధ్యగా ఉన్నాయి. అలా వాళ్ళ ఫోటో పేపర్లో గాని ప్రకటిస్తే ఆ క్రింద ఇలా వివరణ ఇవ్వవలసి ఉంటుంది. ఎడమ నుండి కుడికి వరసగా: కొడుకు శ్రీరాములూ, మనుమరాలు బుజ్జిని ఒళ్ళో కూచోపెట్టుకున్న కోడలు మంగా, తల్లి భద్రావతి, తండ్రి గణపతి, "సినిమాకి వచ్చినా నిశ్చింతగా గడపనివ్వవ్‌కదా!" అన్నట్టు గణపతి కళ్ళజోడులోంచి చికాగ్గా నిస్సహాయంగా చూశాడు పెళ్ళాం వేపు.

అవును మరి, అప్పుడు తెర మీద పడిన బొమ్మ స్వారస్యం అంతటిది. అది నైటు క్లబ్బు సీను. ఆ తార స్మితామాలినీ రాధ, ఓ అద్దాల గదిలో మునిపాదాల మీద ఆనుకొని అటూ ఇటూ ఊగుతోంది. ఆ అమోఘాంగి ముందు భాగాలు గది ఇవతలి గోడకీ, వెనుక భాగాలు అవతలి గోడకీ తగిలేటంత విస్తృతమైన ఏర్పాట్లు యుద్ధప్రాతిపదిక మీద చేయబడి ఉన్నాయి. కంటి చూపు నుండి ఏ పసందైన సందు తప్పిపోతుందో అని ఆతృతతో కూడిన ఆందోళనతో ప్రేక్షక మహాశయులందరూ రెప్పవెయ్యకుండా, ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. అందరు తెలుగు సంస్కారవంతుల ఉత్సాహపు ఉత్సుకతని మన్నించే మేనర్స్ నిన్నమొన్నటి గుంటముండ బుజ్జియే మెరుగు! "అమ్మా గోకవే" అని ఓ పెద్ద అరుపు అరిచింది. ఆ అరుపులోనే ఫుర్రుమనో పర్రుమనో మరో చప్పుడు కలిసిపోయింది గాని తల్లికి ఆ తాకిడి తప్పినట్టు లేదు. అన్నిటినీ మించి ఓ వంద మొహాలు అటూ ఇటూ తిరిగి తనవైపు దాడిచెయ్యడం మంగకి తల కొట్టేసినట్టయింది. పక్కనున్న మొగుడి కాలిజోడు మీద తన కాలిజోడుతో ఒక్కసారి గాఠిగా అదమకుండానే ఆ మానవుడు మేలుకొన్నాడు. రబ్బరు గుడ్డమీది బొంతతో సహా భార్య అందించిన చిరు స్వేచ్ఛాజీవిని రెండు చేతులతోనూ అందుకొని, రెండువరసల కుర్చీలని ఎలాగో ఆ చీకట్లో తప్పించుకొని, బ్రతుకు జీవుడా అని ఎలాగో గేటు పట్టుకొని అవతల పడగలిగాడు.

మొగుడికి కొడుకు అవస్థ భద్రావతి చూపించింది సరిగ్గా అప్పుడే. అత్తగారి దృష్టిలో పాకీపనికి కొడుకుని పురమాయించిన కోడలమ్మలకి గురిపెట్టవలసింది ఈ లోకంలో తుపాకీ ఒక్కటే.

అందుకే ఆవిడ మనసు తృప్తిపడింది కాదు.

ఆ రాత్రి భద్రావతి కొడుకూ కోడలూ పడుకున్నారని ముందు నిర్ధారణ చేసుకుంది. ఒళ్ళు తెలీకుండా గుర్రుపెడుతున్న గణపతిని చెవి నులిమి మరీ కూచోబెట్టింది. అతగాడు విసుక్కుంటూ ఆవులిస్తూంటే, అప్పటికప్పుడు నోరు చుర్రుమనే టీ చేసి ఇచ్చి, అది అతగాడు ప్లేట్లో పోసుకొని ఊదుకుంటూంటే అతనికే వినపడే స్వరంతో మొదలుపెట్టింది.

"తల్లడిల్లేదాన్ని తల్లి అంటారు, 'వాడి మానాన్న వాడిని పోనీ' అనుకునే భావంలోనే నాన్న దాగి ఉంటాడు, ఎంత చేయించుకున్నా ఇంకా చేయించుకోవాలనుకునే మగజాతి మీది. మీకెలా

అర్థమవుతుంది లెండి! ఇంతకీ మనవాడి దురదృష్టం. వాడి ముఖాన సుఖపడే రాత లేకపోతే నేనేం చెయ్యగలను!"

భద్రావతి పమిట చెంగుతో కనుకొలుకులు ఒత్తుకుంది. "ఇప్పుడు వచ్చిన దుఃఖం ఏమిటి నీకు?" అన్నాడు గణపతి అసలు విషయం అంతుపట్టక.

"ఇప్పుడేం రాలేదు గాని ఆ మహాతల్లి గుమ్మంలో అడుగుపెట్టిన నాటి నుండి ఆరంభం అయి ఉండాలి నా బిడ్డ కష్టాలు. కడుపులో యింకా ఉండగానే తల్లిని ప్రేమతో తన్నడం మొదలు పెడుతుంది బిడ్డ. అయినా అదేం కడుపు తీపో ఏ తల్లికైనా, ఆ ప్రాణి వల్ల ఎంతటి హింసకి గురి అయినా దాని మీద రోజురోజుకీ మోజు పెరిగిపోతుంది. ఇప్పుడైతే ఎదిగి ఇంతవాడయ్యాడు గాని ఏ చిన్న నొప్పి కలిగినా వచ్చి నా మనసుని చుట్టుకుంటున్నట్టే ఉంటుంది. ఏ పని చేస్తే బిడ్డ ఎక్కడ అలిసిపోతాడో అనే బాధ తల్లిని నాకుగాక, మీకెలా ఉంటుంది చెప్పండి?"

"ఇప్పుడు మన రాములుగాడికి కొత్తగా వచ్చిన బాధ ఏమిటే?"

"తనది కాకపోతే కాశీ దాకా డేకమన్నట్టు మీకేం, వేళకి అన్నీ అమరిపోతుంటే ఒళ్ళో పేపరు పెట్టుకొని కునుకు తియ్యడమేగా మీరు పడే పాటూ! అరమైలు దూరంలో ఉన్న బిడ్డ ఆ రోజుల్లో స్కూలుకి నడిస్తే ఎక్కడ కందిపోతాడో అని రిక్షా పెట్టించాను. అన్ని పుస్తకాలు మొయ్యలేక లేత తమలపాకుల్లాంటి ఆ చేతులు ఎక్కడ కమిలిపోతాయో అని ఆ రిక్షావాడికే నెలకో అయిదు రూపాయలు జీతం పెంచాను. ఆ పుస్తకాల సంచీ రిక్షాలోంచి మనబాబు కూచున్న క్లాసురూంకి మొయ్యడానికీ, తిరిగి సాయంకాలం ఆ రిక్షావాడే అక్కణ్ణుంచి తీసుకొచ్చి రిక్షాలో పెట్టేటట్టూ ఏర్పాటు, అవన్నీ ఇప్పుడు తలుచుకుని ఏం లాభం లెండి. నా ఖర్మకి నేను ఏడవక!"

ఆ అర్ధరాత్రి వేళ ఆ బెడ్‌ల్యాంప్ వెలుగులో పెళ్ళాం చెంపలు తడిసి తళుక్కుమనడం గణపతికి నోటమాట రాకుండా చేసింది. అతగాడి నిద్ర పూర్తిగా తేలిపోయింది. మిగిలిన కాసిన్ని టీ చుక్కలూ మరి గొంతు దిగలేదు. భర్త ఆసక్తి భద్రావతికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. చెప్పుకుపోసాగింది. "మనకేం తెలుసునండీ, నల్లటివన్నీ నీళ్ళూ, తెల్లటివన్నీ పాలూ అనుకుంటాం. చిన్నప్పుడే మనబాబు పెద్దాఫీసరు అయిపోయాడంటే పొంగిబోర్లాపడ్డాం. సూటూబూటూ వేసుకొని, మెరిసే పలువరసతో కురిసే చిరునగవుతో మనవాడు ముందు టకటక నడుస్తూంటే, బంట్రోతులూ గుమాస్తాలూ ఇంతింత ఫైళ్ళు మొయ్యలేక వెనక తీసుకెడుతుంటే, దువ్వుకున్న క్రాపు చెదరకుండా, వేసుకున్న కాలరు నలగకుండా మన రాములు హాయిగా ఉద్యోగం చేస్తున్నాడంటే వీళ్ళూ వాళ్ళూ ఆ సంగతి చెబుతూంటే పరవశించి పోయాను వినివిని.

ఆ హోదాలో బిడ్డని ఎప్పుడు చూస్తానో అని కళ్ళు కాయలు కాచేలాగ ఎదురు చూశాను. మన బాబు బదిలీ అయి మన ఊరికే, మన ఇంటికే వస్తున్నాడని విన్న నాకు నా సంబరానికి, ఆ అంబరానికీ తేడా లేదు! కానీ అంతెత్తు లేచిన ఆ ఆశల అల అప్పుడే ఏ పాతాళంలోకి ఇంకిపోయిందో!

ఆ ఆఫీసులో మనవాణ్ణి ఏ అందలాలు ఎక్కిస్తున్నారో ఇదివరకు నేను విడనం వరకే, కాని ఈరోజు నేను నా కళ్ళతో చూస్తున్నది ఏమిటి? ఇంట్లో మాత్రం నేను కనిపెట్టనంత వరకు మన రాములు చేస్తున్నది గొడ్డు చాకిరీనే. మరి కోడలమ్మ అదెంత తప్పక కడుపుతో ఉందో, మరదెలాగ నొప్పులు పడగలిగిందో అంతటి సుకుమారికీ తప్పనిసరై, అదెలా భూమ్మీద బిడ్డపడిందో, అంతే. చెప్పకేం, నా నోరు అబద్ధపు పలుకు పలకదు. ఆ మూడు పనులూ అదే చేసింది. ఇక మిగిలిన ఆ తొంభై ఏడు పనులూ ఉన్నాయి చూశారూ, అవి మాత్రం మనవాడివే.

కలక్టరయేది, గవర్నరు గిరయేది, మొగుడనే వాడు పెళ్ళాం ముందు 'సిట్' అంటే కూర్చుని, 'స్టాండ్' అంటే నిలుచుని గజగజలాడుతున్నప్పుడు అదెందుకు ఇటు పుల్ల తీసి అటు పెట్టాలి! ఇంకా నాకు చెవుడు రాలేదు గనక ఇంట్లో నాటకం ఇంతో అంతో నేను గమనిస్తూనే ఉన్నానండోయ్! బజారుకి పరిగెత్తి కాజాల పొట్లం తేవడం కాదు, అవి ప్లేట్లో పరచి మంచినీళ్ళ గ్లాసు పక్కని పెట్టడం కాదు, తినమని బతిమాలడం కాదు... ఇలాంటివి నాలుగ్గోడల మధ్య మరో లక్షా తొంభై జరిగినా ఇంతగా నా మనసు కలత పడేది కాదు. ఇవాళ ఆ సినిమా హాల్లో అందరి మధ్య మన తల తీసేసినట్టు అవలేదుటండీ? అక్కడ కూడా మన గొప్పతనం ప్రదర్శించాలా! మనం కూర్చున్న వరసకి అవతలి వరసలో డీసీటీవో గారి కుటుంబం ఉంది. ఇటువైపు ఆదర్శమహిళామండలి సెక్రెటరీ ఆండాళ్ళమగారు ఉంది. పోనీ ఎరగదేమో అనుకుంటే మన కోడలమ్మ నంగనాచీ వంగముల్లాను. ఆట మొదలవక ముందే వాళ్ళని తనే పలకరించిందాయె. తన పక్క జెమాజెట్టీల్లా అత్తామామలం మనం ఉండనే ఉన్నాం. అయినా ఆ తెగించిన దానికి ఎవరి ఖాతరయినా ఉండి చస్తేనా! చేతిలో పిల్ల యిలా కంయ్‌మందో లేదో బంట్రోతు పీనుగరూపంలో ఉన్న భర్తగారికి అందించింది.

ఎంత చదువుకుంటేనేం, ఏ వుద్యోగం వెలిగిస్తేనేం "ఎంత ఆర్యులైనా భార్య దాసులే!" అన్నట్లు శ్రీమతి ఫర్మానా శిరస్సున ధరించాక! వారాల తరబడి గొడ్డుచాకిరీ చేసి, ఎప్పుడో నూటికో నాడు మనల్ని కూడా తీసుకొని విశ్రాంతి కోసం సినిమాకి వస్తే మాత్రం ఏం సుఖం! ఇది ఈ మెత్తటి సీట్లో! మనవాడు ఆ దుక్కముండని ఎత్తుకు మోస్తూ, మూడొంతుల టైమూ ఆ గేటు దగ్గరే నిలువుజీతం! ఖర్మండీ, ఖర్మ! నేనేం అన్నా నా నోరే బయటపడుతుంది. బెల్లం కొట్టిన రాయిలాగ అదొక్క ముక్క పైకి తేలుతేనా!" అంటూ ఎందుకో మొగుడి వైపు చూసి ఏదో పసికట్టినట్లయి మరింత పేట్రేగిపోయింది భద్రావతి.

"అవునవును! నిన్నో మొన్నో వచ్చిన ఆ పై దాన్ని అనుకోవడం ఎందుకులెండి. ముప్పై ఏళ్ళై కట్టుబడి కష్టానికీ, సుఖానికీ అయి, ఈ సంసారమే ఇహమూ, పరమూ అనుకుని చీమూ నెత్తురూ ధారపోస్తున్నాను. మీకేమైనా చీమ కుట్టినట్టు ఉందా అని! అంతవరకు ఎందుకు ఏకపాత్రాభినయంలా ఇంతసేపై నేనే వాగుతున్నాను గాని తమ నోటివెంట ఒక్కటంటే ఒక్కముక్క ఊడిపడిందా అని! ఇన్నీ తెలిసి, యింతగా బయటపడిపోడానికి, యింతసేపూ నా బుద్ధి ఏ గాడిదలు కాసిందంట?"

అంటూ స్పీచ్‌కి స్విచ్ ఆఫ్ చేసి అటు తిరిగి పడుకుంది భద్రావతి.

ఇటు తిరిగి పడుకున్నాడు గాని నిద్రపోవడం లేదు గణపతి. పెళ్ళాం ఇచ్చిన వేడి వేడి ఛాయ్‌తోనే "ఛాయేత్ సర్వ విఘ్నోపశాంతయే" అన్నట్టు అతని నిద్ర తేలిపోయింది.

ఇద్దరు ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేసి చేతులు దులుపుకున్న అదృష్టవంతులు తాము. యోగ్యులైన కొడుకూ కోడలూ నీడలో 'సినీవాసా, చతుర్ముఖ పారాయణా' అంటూ హాయిగా గడపవలసిన రోజులు తమవి. ఇప్పటికీ రాత్రి పదిగంటలయినా మొక్కజొన్నపొత్తులు కాల్పించుకొని తిని ఆరాయించుకునే ఆరోగ్య మహాభాగ్యాలు తమవి. వాళ్ళ మట్టుకు వాళ్ళని బతకనివ్వక ఈ ఆడాళ్ళు ఎందుకిలా గింజుకుంటారో అతనికి అర్థం కాదు. ఇంకా ఈ భద్రావతి కోపం తాటాకు మంటలాంటిది. ఇంతలా కుమిలిపోయిందనుకున్న ఈ అత్తగారే తెల్లారి లేచి, అదే కోడల్ని చూసి 'అదేమిటే మంగా, అంత జుత్తూ అలా అంటుకున్నట్టు తెగమాసిపోయి ఉంటే అలా వదిలేశావ్! బావుంది, ఇంట్లో మరో ఆడదాన్ని ఉన్నాననుకున్నావా, చచ్చాననుకున్నావా? పద, పద! బాగా ఇంత నూనె పట్టించి తల రుద్దుతాను' అంటుంది! ఆ రోజుల్లో గణపతి తల్లి రంగమ్మ ఒక్కరోజు సుఖపడనిచ్చిందా?

ఎంత వద్దనుకున్నా ఆ రోజుల వేదన అతన్ని వెంటపెట్టక మానలేదు. రంగమ్మ దృష్టిలో ఆడదంటే గాడిద చాకిరీ చెయ్యడానికి, తన్నులు తినడం, ఆ రెండే దాని బతుక్కి సూడిద.

'పెళ్ళాం అంటే ఎవర్రా పిచ్చి సన్నాసీ' అంటూ మొదలెట్టేది వాళ్ళమ్మ. "మొగుడికి కాళ్ళు పట్టి, అవే కాళ్ళచేత తన్నులు తిని, అందుకనే వాటికి మొక్కుతూ బతకవలసిన మొండిపీనుగ"

"అవున్రా, ఇవన్నీ నేను చెయ్యలేదా! మా అత్తగారు ఇలాగే బతికి ఓహో అనిపించుకోలేదా, ఆడాళ్ళం, మా అందరిదీ ఒకే జాతి. నీ పెళ్ళామూ అలాంటిదే. ఇదేం సీతలా భూమిలోంచి పుట్టుకొచ్చిందా? గంగలా ఆకాశం మీంచి ఊడిపడిందా!"

తన భార్య ఆనాడు అన్నిరకాల కోడింటికం అనుభవిస్తూంటే చూస్తూ ఏం చెయ్యగలిగాడు గణపతి? నిస్సహాయంగా ఊరుకోవలసి వచ్చింది. అలా ఊరుకున్నందుకు మిగిలిన జీవితమంతా తనని తాను క్షమించుకోలేని స్థితికి తెచ్చింది. ఆ రోజుల్లోనే ఒకసారి బాధపడుతున్న సాటిజీవికి తను చెయ్యి అందించబోతే ఎంత అల్లరి జరిగింది. జన్మలో మరిచిపోగలడా ఆ సంఘటన!

అది తన భార్యకి మూడో పురుడు. వాళ్ళ ఆనవాయితీ ప్రకారం పురుడు అత్తింట్లోనే పోసుకోవాలి. అప్పుడు భద్రావతికి నిండు నెలలు. గర్భవతి అనైనా జాలిలేకుండా కాల్చుకుతినే ఇద్దరు పసిపిల్లలు. అయినా మంచి ఆరోగ్యం గనుక ఏదైనా చేసుకుపోయేది గాని వంటింటి నుంచి పదిమెట్లు కిందికి పెరట్లోకి దిగి, మళ్ళీ ఎత్తుగా ఉన్న నూతిచప్టా అయిదు మెట్లెక్కి, నీళ్ళు తోడి తేవడానికి మాత్రం ఆమె ఆయాసపడిపోయేది. అలా ఒకటా రెండా, వంటింట్లో పెద్ద కుండీ ఉండేది. అది నింపాలి! ఓసారి ఆ అలసట చూడలేక, పెళ్ళాం కళ్ళు తిరిగి పడిపోతుందేమో అని, వంటింటి

అరుగు మీంచి పెళ్ళాం నెత్తి మీద నీళ్ళ బిందె అందుకున్నాడు గణపతి. అది చూసి రంగమ్మ ఊరువాడా పిలిచి చూపించి పెట్టిన గొడవనీ, చేసిన అల్లరినీ, ఏ అక్షరమూ మరిచిపోలేదు.

తనే మరచిపోలేకపోయాడే, అంతటి కఠిక అత్తాగారశిక్ష అనుభవించిన భద్రావతి అదే కళ్ళతో కోడల్ని ఎందుకు చూడలేకపోయిందని? తను స్వయంగా బాధపడడమే కాదు. తన ఇద్దరు కూతుళ్ళూ సమిష్టి కుటుంబాల్లో పడి అంతో ఇంతో కోతపడుతున్నారని తనే దుఃఖపడి పదిమందితో చెప్పుకుంటుంది. స్వయంగా మృదు హృదయ అయిన ఆడది తన కొడుకు చేపట్టిన పడతిని చూడగానే గన్నేరు పువ్వులాంటిది ఒక్కసారి పల్లేరు ముల్లుగా మారిపోవడం కంటె ఈ లోకంలో చిత్రమైన విషయం ఉందా?

గర్భధారణం, ప్రసవం లాంటి ప్రత్యేక శిక్షలు స్త్రీ జాతికి ఎలాగా ప్రకృతి విధించింది చాలక "చీపురు పట్టుకోకూడదు". "పసిపిల్లల్ని శుభ్రం చెయ్యకూడదు" లాంటి కన్సెషన్స్ కూడా తల్లులు తమ మగపిల్లలికి యిచ్చుకోవాలా!

ఇంతకీ మంగ మొగుడితో సరిసమానంగా ఉద్యోగం చేస్తోంది. అన్ని పనులూ చక్కబెట్టి పదింటికి ఆఫీసుకి వెళ్ళి ఆరింటికి ఉసూరుమంటూ ఇంటికొస్తుంది. ఎప్పుడమ్మ వస్తుందా అని వీధి మెట్టు మీద కూచుని ఉందే ఈ అణాపరక ముండ బుజ్జి ఒకర్తిచాలు తల్లిని బరకడానికి!

భద్రావతి వైపు ఆశ్చర్యంగా చూశాడు గణపతి. కొడుకు గురించి అంతగా ఆలోచించిన తల్లి నోటి నుంచి కోడలు గురించి ఒక్కటంటే ఒక్క మంచి ముక్క రాదా! గణపతికి ఈ జన్మలో జవాబు దొరికే అవకాశం లేదని అతను మరచిపోయాడు. అతను మొగాడు, ఆమె ఆడది!

★